www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 15 జనవరి 2024
5
వైఎస్ఆర్



ఇక్బాల్ రైస్ మిల్లుపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలి :'సిటు'

కడప సిటీ : కడప బటి సర్కిల్ వద్దనున్న ఇక్బాల్ రైస్ మిల్లుపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. బియ్యం రేట్లు రోజు రోజుకూ విపరీతంగా రేట్లు పెంచుతున్నారన్నారు. ఎవరికి రశీదు ఇవ్వకుండా బియ్యాన్ని విక్రయిస్తున్నారని తెలిపారు. వారికి పర్మిషన్ ఉందో, లేదో అర్థం కాని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని అధికమైన రేట్లు బియ్యం అమ్ముతున్నారన్నారు. ప్రముఖ బ్రాండ్ల యాజమాన్యం రేట్లు విపరీతంగా పెంచుతున్నారని, అలాగే ఇక్బాల్ రైస్ మిల్లు యాజమాన్యం కూడా రేట్లు పెంచి ప్రజలపై భారాలు మోపడం దుర్మార్గమని తెలిపారు. గోడౌన్‌లలో ఉన్న లోడుల పై సెల్ టాక్స్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకొని ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల ప్రకారం విక్రయించేలా చూడాలని కోరారు.

బద్వేల్, జమ్మలమడుగులలో ఎస్మా జిఒ ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న అంగన్వాడీలు



పండుగ మీకు.. పస్తులు మాకా.. జగనన్నా..!

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వైఎస్ఆర్ జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 34వ రోజుకు చేరుకుంది. వై ఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగించారు. భోగి పండుగ సందర్భంగా ప్రభుత్వ జారీ చేసిన ఎస్మా జిఒ నంబర్ 2 ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు.

- భోగి మంటలు, రోడ్డుపై దోశలు వేస్తూ నిరసన
- 34వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె

కడప : అంగన్వాడీల సమ్మె ఆదివారం నాటితో 34వ రోజు కూడా కొనసాగింది. అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కడప కలెక్టర్ ఎదుట వినూత్నంగా భోగిమంటలు వేసి, రోడ్డుపై దోశలు వేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మి రాజా, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మీదేవి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్ మాట్లాడుతూ 34 రోజులుగా శాంతియుతంగా సమ్మె నిర్వహిస్తుంటే సజ్జల రామకృష్ణారెడ్డి 'జీతాలు పెంచం మీరు విధుల్లోకి రండి, లేనిపక్షంలో ప్రత్యామ్నాయం చూసుకుంటాం' అని బెదిరింపు రాజకీయాలకు పూనుకోవడం బాధ్యతారాహిత్య మన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఉద్దే మదిలేటి సిఐటియు నగర అధ్యక్షులు పి చంద్ర రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా, నగర కార్యదర్శులు వి. శివకుమార్, డి. ఎం. ఓబులేసు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు రాజేంద్ర, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎంపీ అంజనీ దేవి, నాయకులు సావిత్రి,వినీల, నాగవేణి, కృష్ణవేణి సిఐటియు నాయకులు ఉదయ్, అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** ఎస్మా చట్టాన్ని ప్రయోగించి సమ్మెను విరమించేలా ప్రభుత్వం చూస్తోందని తాము అలాంటి చట్టాలకు బెదిరి సమ్మెను ఉపసంహరించేది లేదని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు భాగ్యమ్మ , లక్ష్మీదేవి పేర్కొన్నారు. ఆదివారం జమ్మలమడుగు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు నిరవధిక సమ్మెలో భాగంగా ఎస్మా చట్ట ప్రతుర్లను భోగిమంటల్లో దగ్ధం చేస అంగన్వాడీలు వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కులయమ్మ, నరసమ్మ, సిపిఐ ప్రసాద్, అంగన్వాడీలు పాల్గొన్నారు. **బద్వేలు :** స్థానిక సిడిపిఒ వద్ద అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో 34వ రోజు ఆదివారం రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా అంగన్వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఏస్మా చట్ట జీవో 2 ప్రతులను భోగిమంటల్లో దగ్ధం చేసి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కో కన్వీనర్ పి.సి కొండయ్య, భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని పట్టణ కార్యదర్శి గంగనపల్లె నాగార్జున, సిఐటియు పట్టణ నాయకులు రాజగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం గోపవరం మండల నాయకులు పొదిలి కదిరయ్య, ఐద్వా మహిళా సంఘం పట్టణ నాయకురాలు నాగమ్మ, అంగన్వాడీ యూనియన్ బద్వేలు ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఆర్.హుసేనమ్మ, ప్రాజెక్టు నాయకులు రాధమ్మ,గౌరీ, జయప్రద, సత్యవతి, విజయమ్మ, కళావతి, ఉమాదేవి, మహాలక్ష్మి, కృష్ణవేణి, తులసమ్మ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఎస్మా చట్టం జిఒ నంబర్2 ప్రతులను భోగి సందర్భంగా భోగిమంటల్లో దహనం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, మంజుల, రాజీ, రామసుబ్బమ్మ, సునీత, శివమ్మ, గురుదేవి పాల్గొన్నారు. **మైదుకూరు :** సంక్రాంతి పండుగకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి భోగి మంటలు అని రాష్ట్రంలోని అంగన్వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు ఆకలి మంటలు అంటూ అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక సిడిపిఒ కార్యాలయం ఎదుట భోగి పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 2 ఉత్తర్వులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. హక్కులు అడుగుతే అరెస్టు చేస్తారా అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు ధనలక్ష్మి, భారతి, చెన్నమ్మ, రామతులసి, రిజ్వన, జి.లక్ష్మి, రమాదేవి, పుష్ప, అనురాధ, శ్రీదేవి, అంగన్వాడి కార్య కర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **చాపాడు :** 34రోజులుగా తమ న్యాయ మైన సమస్యలను పరిష్క రించాలని నిరసన తెలుపుతున్న అంగ న్వాడీలు భోగి పండుగ ఆదివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద తమ నిరసనను తెలియజేస్తూ భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు : భోగి మంటల్లో జిఒ ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు



జిల్లాలో కోడిపందేలకు తెరలేచింది. సహజంగా సంక్రాంతి పండుగ చివరి రోజైన కనుమ పండుగ రోజున చేపట్టాల్సిన పందేలు తొలిరోజునే నిర్వహించడం గమనార్హం. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నియోజకవర్గ పరిధిలోని సింహాద్రిపురం మండలం వేదికగా మారడం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. రాష్ట్ర హైకోర్టు కోడిపందేలను నిర్వహించడం జీవహింస కిందకు వస్తుందని, ఇటువంటి పందేలు ఆడకుండా చూడాలని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ అమలుకు ఆమడదూరంలో నిలవడం విస్మయాన్ని కలిగిస్తోంది.

సింహాద్రిపురంలో పందేల జోరు
రూ.కోట్లలో పందేలు కాస్తున్న వైనం
హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

జిల్లాలో కోడిపందేలజోరు కొనసాగుతోంది. ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం కోడిపందేలకు వేదికగా మారింది. టిడిపి ప్రభుత్వ హయాం నుంచి కోడిపందేలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గతేడాది నిర్వహించిన కోడిపందేల్లో కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు వార్తలు రావడం తెలిసిందే. తాజాగా సింహాద్రిపురం మండలం బిదినంచర్ల గ్రామ శివారు ప్రాంతంలోని ఎస్సీ కాలనీని వేదికగా చేసుకున్నట్లు సమాచారం. వేదికను ఎంపిక చేసుకోవడమే గాకుండా సంక్రాంతి పండుగ తొలిరోజైన మకర సంక్రాంతి రోజునే పోటీలు నిర్వహించినట్లు విశ్వసనీయంగా తెలి సింది. సహజంగా సక్రాంతి పండుగ చివరి రోజైన మకర సంక్రాంతి రోజున కోడిపందేలు నిర్వహించడం పరిపాటి. ఇందుకు భిన్నంగా ఈయే డాది పండుగ తొలిరోజునే కోడిపందేలను నిర్వహించడం గమనార్హం. పొరుగు రాష్ట్రమైన కర్నాటక, పొరుగు జిల్లాయైన అనంతపురం జిల్లాల నుంచి కోడిపందేలను తిలకించడానికి పెద్దఎత్తున తరలి వస్తున్నట్లు సమాచారం. దీనికితోడు 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట సంక్రాంతి పండుగ తొలిరోజైన మకర సంక్రాంతి రోజు సాయంత్రానికి నాలుగు విభాగాల్లో సుమారు 12 సార్లు కోడిపందేలను పెద్దఎత్తున నిర్వ హించినట్లు తెలుస్తోంది. పందేనికి కనిష్ఠంగా రూ.10 వేలు పందేలు పెట్టి నట్లు సమాచారం. ఈలెక్కన 15, 16 తేదీల్లో పెద్దఎత్తున కోడిపందేలు నిర్వహించడానికి సమాయత్తం అవుతుండడం గమనార్హం. ఒకవైపు హైకోర్టు సీరియస్‌గా ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ అమలుకు ఆమడదూరంలో నిలవడం విస్మయాన్ని కలిగిస్తోంది. సంబంధిత మండల పోలీసులు కోడి పందేలను ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటన చేయడం వరకు పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై జిల్లా ఎస్పీని ఫోన్‌లో మూడు దఫాలు సంప్రదించగా అందుబాటులోకి రాకపో వడం గమనార్హం.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి

- రూ.15.75 కోట్లతో ప్రతిపాదనలు
- రూ.170.11 కోట్లతో ప్రతి ఇంటికీ కుళాయి
- ఈ ఏడాది మార్చి నాటికి వాటర్‌గ్రిడ్ సిద్ధం
- ఆర్‌డబ్ల్యుఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వీరన్న



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తాం. ఈఏడాది మార్చి నుంచి తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాం. జిల్లాలోని 35 మండలాల పరిధిలోని తాగునీటి వనరులైన చేతిపంపులు, బోర్లు, సిపి డబ్ల్యు స్కీముల పనితీరును పరిశీలించడమైంది. జిల్లాలో తీవ్ర ప్రభావిత హ్యాబిటేషన్లు గుర్తించాం. బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలా ల్లో ట్రాన్స్‌పోర్టేషన్ సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని భావించాం. ఈమేరకు జిల్లాలోని ఎంపిడిఓ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలతో కలిసి సంయుక్తంగా తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి సారించడమైందని పేర్కొంటున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ వీరన్నతో ముఖాముఖి...

తాగునీటి వనరుల వివరాలు తెలపండి?

జిల్లాలోని 35 మండలాల్లో 549 పంచాయతీలు న్నాయి. ఇందులో 6,715 చేతింపులు, పిడబ్ల్యుఎస్, ఎంపిడబ్ల్యుఎస్, డిపి స్కీములు 2,772, సిపిడబ్ల్యు స్కీములు 15 ఉండగా, రెండు మినహా మిగిలిన స్కీ ములన్నీ యాక్టివ్‌గా ఉన్నాయి.

తాగునీటి ఎద్దడి నివారణ ప్రతిపాదనలు చెప్పండి?

జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు సంబంధించి రూ.15.75 కోట్లకు ప్రతిపాదనలు అందజేశాం. ఈఏడాది మార్చి నుంచి జూన్ వరకు నిధులను ఖర్చు చేసే అవకాశం ఉంది. తాగునీటి బోర్ల ఫ్రెస్సింగ్, ఫ్లస్సింగ్, డీపెనింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ చేయడానికి ఖర్చు చేయాల్సి ఉంది.

పులివెందుల వాటర్‌గ్రిడ్ పనుల గురించి తెలపండి?

రూ.460 కోట్లతో పులివెందుల వాటర్‌గ్రిడ్ పనులు చేపట్టాం. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల పరిధిలో 299 హ్యాబిటేషన్స్‌కు తాగునీటిని అందించడానికి కసరత్తు చేస్తోంది. మేఘా ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టు సంస్థ పనులను చేపడుతోంది. ఇప్పటికీ 75 శాతం పనుల్ని పూర్తి చేసింది. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి అందు బాటులోకి తేవాల్సి ఉంది.

సిపిడబ్ల్యుఎస్ స్కీములు ఎన్ని పని తీరు?

15 సిపిడబ్ల్యు స్కీములున్నాయి. ఇందులో ఒంటిమిట్ట సిపిడ బ్ల్యుస్కీమ్ వరద ముంపులో మునిగిపోయిన నేపథ్యంలో పని చేయడం లేదు. మాధవరం సిపిడబ్ల్యుస్కీమ్ పంచాయతీకే అప్పగి ంచడం జరిగింది. దీంతో 13 స్కీములు పని చేస్తు న్నాయి. 477 హ్యాబిటేషన్ల పరిధిలో 3,74, 152 మందికి తాగునీటిని అందించే ప్రయత్నం చేస్తున్నాం.

గడపగడపకు సమస్యల పరిష్కారమేమిటి?

గడపగడపకూ ప్రభుత్వం దృష్టికి 231 సమస్యలు ఎదురుకావడమైంది. 31 సిసిడ్రెయిన్లు, బోర్లు, మోటార్లు, 179 పనులు పురోగతిలో ఉన్నాయి. ఇందులో 13 బిల్లులను అప్‌లోడ్ చేయడమైంది.

జల్‌జీవన్ పనుల పురోగతి ఎలా ఉంది?

రూ.170.11 కోట్లతో జల్‌జీవన్ స్కీమ్ పనులు చేపట్టడమైంది. 2,521 పనులు చేపట్టాం. ఇందులో 90 శాతం పనులు పూర్తి చేశాం. జిల్లావ్యాప్తంగా రూ.26.87 కోట్లతో 26,0 94 ఇళ్లకు కుళాయి కలెక్షన్స్ ఇవ్వాల్సి ఉంది.13,647 కుళాయి కలె క్షన్లు ఇవ్వడం జరిగింది.


దేశ రాజకీయాల్లో పెనుమార్పు : పిసిసి

కడప : భారత్ జోడో న్యాయ యాత్రతో దేశ రాజకీయాలలో పెను మార్పులు వస్తాయని పిసిసి మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్ యాత్ర ఈనెల 14 నుంచి మార్చి 20 వరకు 6713 కిలోమీటర్లు మణిపూర్ నుంచి ముంబై వరకు సాగుతుందన్నారు. 15 రాష్ట్రాలు, 110 జిల్లాలు, 100 లోక్ సభ నియోజకవర్గాలు, 327 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 66 రోజులపాటు ఉంటుందన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారన్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతుల, కార్మికుల దుస్థితి, పేద – ధనికుల మధ్య వ్యత్యాసం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తా రన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశానికి శని గ్రహంల దాపురించింది అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు విష్ణు ప్రీతం రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, పిసిసి ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, పిసిసి రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటరమణారెడ్డి, పిసిసి డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, పిసిసి మైనార్టీ ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, సుబ్రహ్మణ్యం శర్మ, షేక్ గౌసియా, శ్యామలమ్మ, నాగరాణి, తిరుపాల్ రెడ్డి, బోరెడ్డి నరసింహారెడ్డి, అబ్దుల్ రసూల్, ఆకుల వెంగల్ రెడ్డి, బాలు, పూల నజీర్, గోగుల రమేష్, సంధానిబాషా పాల్గొన్నారు. **గెలుపే లక్ష్యంగా పనిచేయాలి..** రాబోవు లోక్ సభ అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసి రెడ్డి సూచించారు. ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. సమయం చాలా తక్కువగా ఉందని రోజూ అంకితభావంతో పార్టీకి కృషి చేయాలని సూచించారు. ఇండియా కూటమిలోని వామపక్షాలతో ఆమ్ ఆద్మీ పార్టీతో క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకోవాలని జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు సూచించారు. కార్యక్రమంలో పొట్టి పాటి చంద్రశేఖర్ రెడ్డి, విష్ణు ప్రీతం రెడ్డి, చీకటి చార్లెస్, శ్యామలమ్మ, చిన్నపరెడ్డి, అచ్యుతరాజు, నరసింహారెడ్డి, శివ, జిలాని, రఫిక్, సంధాని భాష, పుష్పరాజు, రాజేష్ పాల్గొన్నారు.

టిడిపిలో వంద కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలోని గొంటువారి పల్లెలో ఆదివారం వైసిపి నుంచి తెలుగుదేశం పార్టీలోకి దాదాపు 100 కుటుంబాలు చేరాయి. గ్రామానికి చెందిన కొండ రామసుబ్బారెడ్డి నాయ కత్వంలో వంద కుటుంబాలు పైబడి కార్యకర్తలందరూ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని వచ్చిన ప్రతి కార్యకర్తకూ న్యాయం జరుగుతుందని తెలిపారు. అందరూ కలిసి కట్టుగా బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని గెలిపిద్దామని కోరారు. పార్టీ మారిన రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు గతంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఉద్దేశించి తాను, అనుచరవర్గమంతా పార్టీ మారామని ఆయన అన్నారు. చేరిన వారిలో సుంకే శ్రీనివాసులు, చిన్న, హుస్సేన్, బసిరెడ్డి జయరాంరెడ్డి, శేఖర్‌రెడ్డితోపాటు వంద కుటుంబాల వారు చేరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రితీష్ కుమార్‌రెడ్డి, బద్వేల్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉల్లి నాగరాజు, టిడిపి నాయకుడు రవీంద్రారెడ్డి, కోడిగుడ్లపాడు టిడిపి నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, రవీంద్రారెడ్డి, రాజారెడ్డి, గురివిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రితీష్‌రెడ్డి

మోసపూరిత హామీల పత్రాలు దహనం

ప్రజాశక్తి- కడప

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి యువతకు అధికారంలోకి వేస్తే ఏటా డిఎస్‌సిని ఇస్తానని అపద్దపు, మోసపూరిత హామీలు ప్రకటనలు గడిచిన నాలుగు సంవత్సరాలు ఏడు నెలలు దాటిన రాకపోవడంతో నిరసిస్తూ డివైఎఫ్ఐ అధ్వ ర్యంలో మోసపూరిత హామీల పత్రాలను స్థానిక కలెక్టరేట్ వద్ద భోగి మంటలలో దహనం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువత డిఎస్‌సి కోసం నాలుగు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గడిచిన ఇన్ని సంవత్సరాలలో ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహిచకపోవడం దారుణం అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో యువతకు అధికారంలోకి వస్తే ఏటా డిఎస్‌సి నిర్వహిస్తానని చెప్పి అధికారం లోకి వచ్చాక ఇప్పటి వరకు ఒక్క డిఎస్‌సి కూడా విడుదల చేయలేదు అన్నారు. రాష్ట్రంలోని యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు వలసలు పోతున్నారు అన్నారు. మంత్రి బొత్స ఇచ్చిన హామీ ప్రకారం సంక్రాంతి తర్వాత అయిన కచ్చితంగా డిఎస్‌సి నిర్వహించాలి, పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని లేని పక్షంలో రానున్నది ఎన్నిక కాలమని తర్వాత యువత ప్రభుత్వానికి తగిన రీతిలో ఓటు ద్వారా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు, నాయకులు రాజేంద్ర ప్రసాద్ ,ఉదయ్ పాల్గొన్నారు.


భోగి మంటల్లో హామీ పత్రాలు దహనం చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

బాలలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

మండల పరిధిలోని రామాయపల్లి ఎస్‌టి కాలనీలోని 43 మంది బాలబాలికలకు ఆదివారం వివేకానంద ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది చలికాలంలో దాతల సహకారంతో దాదాపు 400 మంది అనాథలకు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కాలనీలోని పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కొన్నేళ్లుగా కాలనీ వాసులకు పలు రకాలుగా సహాయసహకారాలు అందిస్తున్నామన్నారు. దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని పిల్లల్ని బాగా చదివించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శిరిగిరి శివ, నాలి రమణయ్య, పీరారెడ్డి, సాయికుమార్, సుధాకర్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామకృష్ణారెడ్డి

ప్రభుత్వ నిరంకుశత్వం నశించాలి : యుటిఎఫ్

- భోగి మంటల్లో ప్రభుత్వ నిర్బంధ పత్రాలు దహనం

ప్రజాశక్తి-కడప

ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిరంకుశ, నిర్బంధ తీరు నశించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాళెం మహేష్ బాబు తెలిపారు. ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని యుటిఎఫ్ భవన్ ఎదుట భోగిమంటల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిరంకుశ విధానాలు నశించాలంటూ ఉపాధ్యాయుల నిర్బంధాలకు సంబంధించిన పత్రాలను భోగిమంటల్లో దహనం చేస్తూ నినాదాలు చేశారు. న్యాయబద్ధంగా తమకు రావలసిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం చెల్లించకుండా కాలయాపన చేస్తూ ఉపాధ్యాయులను వేధించడం మంచిది కాదని ఉపాధ్యాయుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక విధానాలు నేటితో ఈ భోగిమంటల్లో నశించి సంక్రాంతి పండుగకు పురస్కరించుకునైనా డిఎ, పిఆర్‌సి, సరెండర్ లీవ్, ఎపి జిఎల్ఐ, మెడికల్ రియంబర్స్మెంట్, సిపిఎస్ ఉద్యోగుల అరియర్స్ తదితర ఆర్థిక బకాయిలన్నీ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఉద్యమం తీవ్రతరం చేసి ప్రభుత్వం మెడలు వంచైనా న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి. రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు గంగన్న, శంకర్ బాబు, గోపాల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, విశ్వనాథ్, ప్రకాష్ బాబు, మజ్జారి చెన్నకేశవులు, శ్రీనివాసులు, వీరనారాయణ, దేవ దత్తం, శివశంకర్, కిరణ్ కుమార్, సుబ్బారావు, సుబ్బారెడ్డి, కిరణ్ బాబు, వెంకటరమణ, కరిముల్లా, సురేంద్ర నాథ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు గంగరాజు పాల్గొన్నారు. **బద్వేలు :** ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించే వరకు తమ పోరాటం ఆగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ హెచ్చరించారు.ఆదివారం బద్వేలు పట్టణంలో భోగి పండుగను పురస్కరించుకొని యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ అప్రజాస్వామిక, అహంకారపూరిత, నిరంకుశ వైఖరులను భోగిమంటల్లో దగ్ధం చేస్తూ వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి సర్కార్ ఉద్యోగుల పట్ల అప్రజాస్వామికంగా, అహంకారపూరితంగా, నిరంకుశంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జిల్లా కేంద్రంలో రిలే దీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు టి.శివ ప్రసాద్, బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవానందం, కె.సుధాకర్, గోపవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరదాసరి క్రిస్టఫర్, వి.కృష్ణుడు, ట్రెజరర్ ఎం.రామచంద్రయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్.చెన్నయ్య, ఎస్.మస్తాన్ వల్లి, ఎస్.పవన్ కుమార్, ఎస్.ఎం.డి.గౌస్, కె.ఈశ్వరయ్య, టి.పెంచలయ్య, కె.శ్రీనివాసులు, ఎం.గుర్రయ్య, ఎస్.నరసింహులు, వి.హిమ శైలజ, బి.సుమలత పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్ర చెన్నయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం భోగి పండుగ సందర్భంగా ఉపాధ్యాయులకు రావలసిన బకాయిల మీద, నిరసన కార్యక్రమాన్ని యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పోరుమామిళ్ల రీజియన్ సభ్యులు గఫర్, ఈశ్వరరావు, నాయబ్ రసూల్, చెన్న కృష్ణయ్య, కృష్ణయ్య, జాషువా, సురేష్ కుమార్, సుగుణ రావు, జగన్ మోహన్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సిద్దయ్య, సింహరాయలు, బాషా పాల్గొన్నారు.



భోగి మంటల్లో ప్రభుత్వ నిర్బంధ పత్రాలు దహనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఘనంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - కడప సిటీ

కడప నగరంలోని విజయదుర్గా కాలనీలో సిఆర్ఐ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగివేమన యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ జాన పాటి వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఆర్ఐ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, ప్రశంసించారు. సంక్రాంతి పండుగ శుభ సందర్భంగా ముగ్గుల పోటీల కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొవడం హర్షనీయమన్నారు. పోటీలలో మొదటి బహుమతి పిలత, రెండవ బహుమతి కల్పనా రెడ్డి, మూడో బహుమతి రమ్య గెలుపొందారు. మొదటి బహుమతిగా అమ్మవారి బంగారు ప్రతిమ, రెండో బహుమతి బంగారు, మూడవ నాలుగో బహుమతి వెండి జ్ఞాపకాలను బహుకరించారు. కార్యక్రమంలో సిఆర్ఐ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సిఆర్ఐ సునీల్ జయంత్, జిల్లా బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, సిఆర్ఐ దినేష్ కుమార్, వెంకట లక్ష్మమ్మ, సుబ్బమ్మ, 21 డివిజన్ కార్పొరేటర్ సుజాత, సుబ్బరాయుడు, అనిత, రాధాకృష్ణ, విజయ, కాలనీ ప్రముఖులు జయరామిరెడ్డి, ఏసీ కొండారెడ్డి, వెంకటసుబ్బయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.


విజేతలను ప్రకటిస్తున్న న్యాయ నిర్ణేతలు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సంక్షేమ పథకాల అమలుపై ఎమ్మెల్యే ఆరా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆరా తీశారు. పట్టణ పరిధిలోని రెండవ కౌన్సిల్ వార్డులో ఆదివారం ఎమ్మెల్యే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని ప్రతి గడపకు తిరిగారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు అలీ, భాస్కర్, జిల్లా ఎస్‌సి విభాగం ప్రధాన కార్యదర్శి రవి ప్రకాష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి - వేంపల్లె

సంక్రాంతి పండుగ రోజుల్లో సంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను మండల ప్రజలు బంధువులతో ఆనందంగా ప్రశాంతమైన వాతావరణంలో చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కోడిపందేలు, పేకాట, జూదం, వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించకూడదని హెచ్చరించారు. మద్యం సేవించి రోడ్డుపై వాహనాలు నడపరాదన్నారు. పోలీసుల హెచ్చరికలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందేలు, పేకాట నిర్వహణపై సమాచారం అందించాలని కోరారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. 'జూద క్రీడలు వద్దు.. సంప్రదాయ ఆటలు ముద్దు' అనేలా అందరూ పండుగను జరుపుకోవాలని ఎస్ఐ సూచించారు.

రేపు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో కనుమ పండుగ పురస్కరించుకొని ఈనెల 16న మంగళవారం ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం చైర్మన్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. విజేతలకు అచ్చమ్మ గారి మహానందిగారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. సీనియర్ విభాగంలో మొదటి బహుమతి రూ.6వేలు, రెండో బహుమతి రూ.4వేలు, మూడవ బహుమతి రూ.3వేలు, 4వ బహుమతి రూ.2వేలు, 5వ బహుమతి రూ. వెయ్యి అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే జూనియర్ విభాగం(15ఏళ్లలోపు వారు)లో మెదటి బహుమతి రూ.4 వేలు, రెండవ బహుమతి రూ.3వేలు, మూడవ బహుమతి రూ.2వేలు, నాల్గవ బహుమతి రూ.వెయ్యి, 5వ బహుమతి రూ.500 నగదు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల వారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



బహుమతులు అందిస్తున్న శిల్పారామం ఎఒ సుధాకర్

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శిల్పారామంలో జాతీయ యువజన వారోత్సవాలు, సంక్రాంతి సంబరాల్లో భాగంగా నెహ్రూ యువ కేంద్రం, స్నేహిత అమృత హస్తం సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు నిర్వహించిన చెంచాతో నిమ్మకాయ పోటీలను శిల్పారామం పరిపాలనధికారి సుధాకర్ ప్రారంభించారు. ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల్లో ప్రథమ బహుమతి సుమన శ్రీ, ద్వితీయ బహుమతి జాహ్నవి, తృతీయ బహుమతి గంగాదేవి గెలుచుకున్నారు. వీరికి శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి కార్యదర్శి సునీత, అధ్యక్షులు రాజు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి ఉపాధ్యక్షురాలు అనూష, ప్రధాన కార్యదర్శులు హేమలత, లక్ష్మీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

పండుగ వేళ.. రంగులకు భలే గిరాకీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పండుగలు వస్తున్నాయంటే రంగులకు భలే గిరాకీ ఉంటుంది. అందులోనూ కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగ అంటే రంగుల పొడికి మరీ డిమాండ్. నేటి కాలంలో రంగులు లేని రంగవల్లులు అంటూ ఎక్కడ కనిపించదు. ప్రతి ఇల్లు రంగవల్లుల శోభ సంతరించుకుంటుంది. అందుకే రంగుల పొడికి మంచి గిరాకీ ఉంటుంది. పల్లెటూరి నుంచి పట్నం దాకా రంగుల పొడిని వినియోగించడం అలవాటైపోయింది. ఈ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం, వివిధ స్వచ్ఛంద సంస్థలు ముగ్గుల పోటీలను నిర్వహిస్తారు. దీంతో రంగుల పొడికి మరింత గిరాకీ ఏర్పడుతుంది. దీనివల్ల చిరు వ్యాపారులకు కాస్త ఉపాధి ఉంటుంది. నేడు పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లో రంగుల పొడి విక్రయాలు జరుగుతాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏ ఊరు చూసినా ఆ ఇంటి ముంగిట రంగవల్లులు ఉట్టిపడుతున్నాయి. ఏది ఏమైనా సంక్రాంతి, కొత్త సంవత్సరం వంటి రోజుల్లో రంగుల పొడికి గిరాకీ ఉంటుందని చెప్పడంలో సందేహం లేదు.



మార్కెట్లో ఉన్న వివిధ రంగులు

కనిపించని హరిదాసులు..

సంక్రాంతి పర్వదినం సందర్భంగా పల్లెటూర్లలో కనిపించే హరిదాసులు కనుమరుగయ్యారు. సంక్రాంతి అనగానే గుర్తుకు వచ్చే వాటిలో హరిదాసులు ఒకరు. సంక్రాంతి పండుగ నెల పొడవునా గ్రామీణ ప్రాంతాల్లో వీరు దర్శనమిస్తారు. అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలతోపాటు కనిపించే హరిదాసులు కాలగమనంలో దూరమయ్యారు. మానవ నాగరికత ఆవిర్భవించినప్పటి నుండి హరిదాసులు సంక్రాంతి పండుగ వేళ దర్శనం ఇవ్వడం అరుదు. తెలుగు గొప్పదనాన్ని సంకీర్తనలతో తెలియజేయడం హరిదాసుల ప్రాముఖ్యతను అంతరించుకుంటుంది. సంవత్సరంలో ఎప్పుడూ కనిపించని హరిదాసులు ధనుర్మా సంలోనే దర్శనమిస్తారు. నెల రోజులపాటు భక్తి పాటలతో ఇంటింటిని పావనం చేస్తారు. హరిదాసులు కూడా గ్రామీణ ప్రాంతాల్లో తిరగడం వల్ల పల్లెటూర్లు కోలాహలంగా కనిపిస్తాయి. చాలామంది హరిదాసులు కాలగమనంలో కరువయ్యారు. ఏదో అక్కడక్కడ తప్పిస్తే. సంక్రాంతి పండుగకు శోభ తెచ్చే హరిదాసులు రావాలని పండుగ పూర్వ వైభవం సంతరించుకోవాలని ఆశిద్దాం.



గ్రామాల్లో తిరిగే హరిదాసు వేషధారి

ప్రమాదకరంగా వంతెనలు

భయాందోళనలో వాహనదారులు - పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని వలసపల్లె, పెదనపాడు గ్రామాలకు వెళ్లే వంతెనలు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ఎర్రగుంట్ల నుండి వలసపల్లెకు వెళ్లే రహదారిలోని వంతెనపై ఒకవైపు రోడ్డు పూర్తిగా విరిగి కింద పడింది. మరోవైపు పెద్ద రంధ్రం ఏర్పడింది. ఈ వంతెన గుండా ప్రతిరోజూ వందలమంది ప్రయాణి స్తుంటారు. వలసపల్లి, తుమ్మలపల్లి, జువారి సిమెంట్ కర్మాగారం, ఎలంకూరుపల్లి తదితర గ్రామాలకు ఈ వంతెనే ప్రయాణ సౌకర్యం. దీనిపై ప్రయాణించాలంటే తీవ్రభయాందోళనకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ప్రయాణికులు ఆదమరిస్తే ప్రమాదం తప్పదని స్థానికులు హడలిపోతున్నారు. సమస్యను పలు మార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొం ొపెట్టుకున్నా ప్రయోజనం లేదని ప్రజలు వాపోతు న్నారు. నూతన వంతెన నిర్మాణానికి జడ్‌పిటిసి తమ్మిశెట్టి బాలయ్య పలుమార్లు జడ్‌పి సమా వేశంలో మాట్లాడినా అధికారులు స్పందించకపోవడం దారుణం. పెదనపాడు గ్రామం నుండి జువారి సిమెంట్ కర్మాగారానికి వెళ్లే దారిలోని కాజ్ వే ఒకవైపు పూర్తిగా నేల మట్టమైంది. మరోవైపు రోడ్డు మొత్తం నెర్రెలు చీలి రోడ్డు కింది భాగంలో ఉన్న మట్టి కోతకు గురైంది. దీంతో ప్రయాణికులు ఎప్పుడు పడిపోతుందోనని భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రస్తా ద్వారా స్థానిక జువారి సిమెంట్ కర్మాగా రానికి పరిసర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు హడలిపోతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి మూడేళ్ల క్రితమే రూ.40 లక్షలతో టెండర్లు దక్కించుకున్నా ఇప్పటివరకు పనులు మొదలు కాకపోవడం గమనార్హం. పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ స్థానిక ఎమ్మెల్యే బంధువులది కావడంతో ఏమీ చేయలేని పరిస్థితుల్లో అధికారులు ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అటు వలసపల్లి రోడ్డులోని వంతెన, ఇటు పెదనపాడు రస్తాలోని కాజ్ వే పనులను మొదలుపెట్టి, త్వరగా పూర్తిచేసి ప్రజల కష్టాలు తీర్చాలంటూ పలువురు కోరుతున్నారు.



పెదనపాడు వద్ద దెబ్బతిన్న వంతెన రోడ్డు, కాజ్ వే

గ్రామాల్లో వెల్లివిరిసిన సంక్రాంతి శోభ



పిండి వంటలకు సిద్ధం చేస్తున్న యువత

ప్రజాశక్తి - చాపాడు

గ్రామాల్లో సంక్రాంతి శోభ వెల్లివిరిస్తోంది. ప్రజలు ఎక్కడ చూసినా పిండివంటలు చేసుకుంటూ భోగిమంటలు వేస్తూ కనిపించారు. గ్రామాల్లో పాడి పంటలు ఇంటికి వచ్చిన వేళ ఇంటిల్లిపాది సుఖ సంతోషాలతో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. బంధువులను ఇళ్లకు పిలిపించుకొని సంక్రాంతి పండుగను కుటుంబసమేతంగా ఆనందంగా జరుపుకుంటున్నారు. హైదరాబాదు, చెన్నయ్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో ఉన్న వారు గ్రామాలకు చేరుకున్నారు. ఆటపాటలతో పిల్లలు ఆనందంగా గడుపుతున్నారు. మహిళలు ముగ్గులు వేస్తూ సంక్రాంతి శోభ ఉట్టిపడేలా రంగులు దిద్దుతున్నారు. వెదురూరు గ్రామంలోని సంగమేశ్వర దేవస్థానంలో సంక్రాంతి సంబరాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు.

ఘనంగా భోగి పండుగ వేడుకలు


పులివెందుల టౌన్ : పులివెందులలో భోగి పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి వీధిలో వేకువజామునే మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, ఇంటి ముందు ముగ్గులు వేశారు. భోగిమంటలు వెలిగించారు. ఒక్కరికొకరు భోగి పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



వీధుల్లో వేసిన భోగిమంటలు

మాధవరాయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో వెలసిన శ్రీ లక్ష్మీ మాధవ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం భోగి పండుగ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆలయంలోని ఆంజనేయస్వామి, పార్వతీదేవి, శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ భూమిరెడ్డి సుబ్బారాయుడు, కార్యనిర్వహణ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో మాధవరాయ స్వామి

భద్రతలేని పనులు.. అదుపు తప్పుతున్న వాహనాలు



అదుపుతప్పి బోల్తా పడిన లారీ

ప్రజాశక్తి - కొండాపురం

మండలం నుండి వెలుతున్న జాతీయ రహదారి 67కు సంబంధించి పనులను సిఆర్ అసోసియేషన్ సంస్థ పనులను చేస్తోంది. ఆ పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థ ఎలాంటి భద్రత చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ రహదారిపై వెళ్లే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం12.30ప్రాంతంలో ఈ రహదారిపై ఐరన్ ఓర్ తీసుకెళుతున్న ఓ లారీ ఎదురుగా వస్తున్న మరో లారీని తప్పించబోయి బోల్తా పడింది. తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఇక రాత్రి సమయంలో రహదారిపై కారుల్లో వెళుతున్న వారు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు జరగడానికి ఆ కాంట్రాక్టు సంస్థ రహదారి భద్రత చర్యలు చేపట్టకపోవడమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేయకపోవడమే ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది. ఇలాంటి ప్రమాదాలు మరిన్ని జరగకుండా నివారించడానికి రోడ్డు నిర్మాణం సంస్థ భద్రతా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. రోడ్డు వెంబడి బారికేడ్లు ఏర్పాటు చేయాలని, లేనిచో ఈ రహదారిపై జరిగే ప్రమాదాలకు ఆ సంస్థ నష్టపరిహారం చెల్లించాలంటున్నారు. ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

ఏడాదిలోపే దెబ్బతింటున్న లింక్ రోడ్లు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని గ్రామాల నుంచి ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన లింక్ తార రోడ్లు దెబ్బతింటున్నాయి. గతేడాది పాడా నిధులతో ముసిరెడ్డిపల్లి నుంచి సుంకేసులకు 3.6 కిలోమీటర్ల మేర తార రోడ్డు నిర్మాణాన్ని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. ఇందుకు దాదాపు రూ.2కోట్లు ఖర్చు చేశారు. ఈ తార రోడ్డు సరిగ్గా మూడో నెంబర్ కిలోమీటర్ సమీపంలోనే దెబ్బతింది. ఏడాదిలోపే రోడ్డు దెబ్బ తినడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు నిర్మాణం సరైన రీతిలో చేయకపోవడంతోనే దెబ్బతిని ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఎఇ దినేష్ కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. రోడ్డు దెబ్బతిన్న విషయం వాస్తవమే అన్నారు. రైతులు అధిక లోడ్‌తో టిప్పర్ల ద్వారా మట్టిని తరలించడంతో దెబ్బ తిందన్నారు. దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎఇ తెలిపారు.



దెబ్బ తిన్న తారు రోడ్డు

అస్తవ్యస్త పనులతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్‌తో అవస్థలు



వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ తిప్పలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తంగా జరుగుతుండడంతో ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులు జరుగుతుండడంతో అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అదే విధంగా రోడ్డు పనులకు సంబంధించి డ్రయినేజీ పనుల కోసం తీసిన మట్టిని రోడ్డుపైనే వేశారు. వాహనాలు పోయే సమయంలో దుమ్ము, ధూళి విపరీతంగా లేస్తోందని స్థానికులు, వాహనదారులు అల్లాడిపోతున్నారు.

కడప రోడ్డులోని హనుమాన్ జంక్షన్ నుండి పులివెందుల రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వరకు మోటర్ బైకు వాహనదారులు ఆ రహదారిలో వెళ్లాలంటే హడలిపోతున్నారు. దుమ్ము, ధూళి వల్ల రోగాల బారిన పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని వాపోతున్నారు. కడప-పులివెందుల-గండి రోడ్డులో జనం ఇబ్బందులు అధికారులకు కనిపించేలా లేదని పలువురు మండిపడుతున్నారు. కడప రోడ్డులోనే ఎక్కువగా వస్త్ర, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, రెడీమేడ్ దుస్తుల షాపులతోపాటు నిత్యావసర వస్తువుల దుకాణాలు ఉండడంతో పండగల సందర్భాల్లో ప్రత్యేకించి రద్దీ ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. దీంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. ట్రాఫిక్ సమస్యపై పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలి

- గురుమూర్తి యాదవ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు గౌతమబోయిన గురుమూర్తి యాదవ్ రాష్ట్ర ప్రజలందరికీ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం కన్నెలూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పండిన పంటలు ఇంటికి వచ్చాక చేసుకొనే మొదటి పండగ సంక్రాంతి అన్నారు. సుఖసంతోషాలు, సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రతి కుటుంబంలో వెలుగులను నింపాలని కోరుతున్నానని తెలిపారు.





భోగి మంటలో చీకటి జిఒలను కాల్చివేస్తున్న టిడిపి శ్రేణులు

ప్రభుత్వ చీకటి జిఒలు దహనం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వైసిపి ప్రభుత్వం తెచ్చిన చీకటి జిఒలను ఆదివారం భోగిమంటల్లో టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. మున్సిపాటిలీ పరిధిలోని కన్నెలూరులో ఆయన భోగి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఒక్కటంటే ఒక్క హామీ సరిగ్గా నెరవేర్చలేదన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధి చూపించే స్టీల్ ప్లాంట్, ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మించలేదని విమర్శించారు. నియోజకవర్గంలో గండికోట, రాజోలి ప్రాజెక్టుల ముంపు బాధితులకు న్యాయం చేస్తామని చెప్పి వారిని మోసం చేశారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. అప్పుడే రాష్ట్రంతోపాటు మన నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, దేవగుడి యూత్ మండల బాధ్యులు సింగంరెడ్డి నాగేశ్వర రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

కడప అర్బన్ : జగన్మోహన్ రెడ్డి నియంతృత్వ పరిపాలనను నిరసిస్తూ భోగి పండుగ సందర్భంగా జీవో పత్రాలను తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు, కడప నియోజకవర్గం మాజీ ఇన్‌ఛార్జి వి. ఎస్. అమీర్ బాబు ఇంటి వద్ద భోగి మంటల్లో కాల్చివేశారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక రాక్షస నియంతన పాలన సాగుతోందని చెప్పారు. ఎప్పుడూ నిత్యము ఏదో ఒక అరాచక కార్యక్రమాలతో ఈ రాష్ట్రం అట్టడిగి పోతుందని తెలిపారు. ప్రజలు సైకో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో విసిగి పోయారని చెప్పారు సంక్షేమ పథకాలను పూర్తిగా నెరవేరేమైపోయిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంఅధికార దాహంతో,మరి ధన ఆశతో ఈ రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేస్తూ దేశంలోనే మన రాష్ట్రాన్ని నవ్వుల పాలు చేసినటువంటి ఘనత దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, నగర ఉపాధ్యక్షులు, 15 వ డివిజన్ ఇన్‌ఛార్జి కొండా సుబ్బయ్య, ప్రముఖ న్యాయవాది, నగర ఉపాధ్యక్షులు శివ శంకర్ రెడ్డి, మురళీమోహన్, ఇమ్రాన్, తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్,6 వ డివిజన్ సీనియర్ నాయకులు మామిళ్ల శివ, నాగేంద్ర నాయుడు, శేషయ్య నాయుడు, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, 39వ డివిజన్ సీనియర్ నాయకులు ఇలియాస్, ఉక్కాయపల్లి శంకర్ యాదవ్, 19 వ డివిజన్ మహిళ సీనియర్ నాయకులు, కడప జిల్లా మహిళ అధికార ప్రతినిధి స్వర్ణలత, మృత్యుంజయ కుంట నూరు బాషా, గంగిరెడ్డి పాల్గొన్నారు.

'ప్రతి కుటుంబం ఇక సంపన్నమే'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబం సంపన్నమే అవుతుందని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని మోరగుడి ఎస్సీ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి బాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను పొందుపరిచిన కరపత్రాలను పంచుతూ వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మోరగుడి విశ్వనాథరెడ్డి, పాలూరు సుధీర్‌కుమార్‌రెడ్డి, గ్రామ ఎస్సి కాలనీ నాయకులు ఇమ్మానియల్, చెన్నయ్య, కిషోర్, చెంద్రాయుడు, ప్రసాద్, అనిల్, అశోక్, కుమార్, ప్రసాద్, మోరగుడి గ్రామ నాయకులు వెంకట్రామిరెడ్డి బాలిరెడ్డి, సుబ్బారెడ్డి, నర్సిరెడ్డి, మాబాషా, మోరగుడి గ్రామ యూత్ తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబం అభిమానులు పాల్గొన్నారు.

తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐగా చంద్రశేఖర్

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా చంద్రశేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మోహన్ ఉద్యోగోన్నతిపై వెళ్ళారు. ఆయన స్థానంలో బద్వేల్ నియోజకవర్గంలోని గోపవరం ఎస్ఐ చంద్రశేఖర్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేందిలేదన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రయత్నించాలని సూచించారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శిల్పారామంలో భోగి పండుగ సందర్భంగా ఆదివారం శిల్పారామం ఆవరణలో పరిపాలనాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. శ్రీ రాజా కళా నిలయం చిన్నారులచే సంక్రాంతి పండుగ జానపద, సినీ పాటలకు నృత్య ప్రదర్శనలిచ్చారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా పుర ప్రజలు ఉదయం నుండే శిల్పారామంలో కుటుంబ సమేతంగా ప్రజలు విచ్చేశారన్నారు. బంధువులతో వనభోజాలు ఏర్పాటు చేసుకుని వీక్షించారు. కార్యక్రమంలో నృత్య శిక్షకులు రాజా, ప్రభాకర్, విల్లాస్‌చ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో చిన్నారులు